క్లుప్తంగా

నేడు అయ్యప్ప పడిపూజ

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ రిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఏడు గంటలకు అయ్యప్ప మండల మహా పడిపూజా నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 గంటలకు గణపతి పూజ, మహాభిషేకం, హోమం, 5 గంటలకు విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వామి చిత్రపటాలతో గంటలకు నగర సంకీర్తన, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3 గంటల వరకు అన్నప్రదాన వితరణ ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి 7 గంటలకు మహా పడిపూజ అనంతరం తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పెదికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సబియాకు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కాగా బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్ బుధవారం అందజేశారు. వారి వెంట బీజేపీ నాయకులు చప్పిడే సత్యనారాయణ, ప్రభాకర్, వెంకన్న, నగేశ్, కాంతారావు, హరీశ్, దూగుంట రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బుధవారం 'పూలే అంబేడ్కర్ బుద్ధభూమి సొసైటీ' నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా విజయ్ ఉప్రె, ఖోబ్రగడె విలాస్, ఉపాధ్యక్షుడిగా శ్యాంరావు, శంకర్ తాక్సాండె, జాడి మొండి, గౌరవ అధ్యక్షుడిగా గేడం హిరిషన్, కోశాధికారిగా మహాత్మా రాజేంద్రప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నియోజకవర్గ ఇంచార్జి లెండుగురే శ్యాంరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోలాసంతోపాటు శరీర దారుఢ్యం కలుగుతుందన్నారు. క్రీడాకారులు సోదరభావంతో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, రాజు, రాజ్‌కుమార్, శోభన్, నరేందర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జైభీంనగర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో రాంటెంకి బాబురావ్, దేవాజి, మౌల్కర్ స్వరాజ్, సాయినాథ్, దయాకర్, డోంగ్రె రామును పట్టుకున్నారు. ఎల్ములే మహేశ్, గాజిరెడ్డి వెంకటేశ్, ఎల్ములే రాజు, దయాకర్, కిరణ్ అనే ఐదుగురు పరారైనట్లు పేర్కొన్నారు. రూ. 1000తో పాటు పేకాట కార్డ్స్‌ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బెస్తకాలనీకి చెందిన కేతమ్మ అనే వృద్ధ మహిళకు స్థానికులు తులసీదాస్, మదిరె ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు బుధవారం అందజేశారు. గత కొన్ని సంవత్సరాల క్రితం భర్త చనిపోగా కేతమ్మకు సంతానం ఎవ్వరూ లేరు. గత ఏడాదిగా పక్షవాతానికి గురై ఇబ్బంది పడుతుండటంతో కాలనీవాసులు రూ. 3 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు.

28న ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని పోచమ్మబస్తీలో శ్రీ శనేశ్వర ఆలయంలో శనిత్రయోదశిని పురస్కరించుకుని ఈనెల 28న ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ పండితులు నంద్‌కిశోర్ జోషి తెలిపారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన గురుకుల విద్యార్థినులు

ఇచ్చోడ: మండలంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రోజరాణి తెలిపారు. అథ్లెటిక్స్‌కు మీనాక్షి, వైష్ణవి, వాలీబాల్‌కు నిఖిత, కబడ్డీ పోటీలకు నందన, కల్యాణి, ఖోఖోలో శిరిష, అనుషలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. బుధవారం వైస్ ప్రిన్సిపాల్ లలిత, గీతాంజలి, పీడీలు స్రవంతి, నందిని అభినందించారు.

కాగజ్‌నగర్‌రూరల్: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



రెబ్బెన: పాల్గొన్న విశ్వ ప్రసాద్‌రావు



వాంకిడి: నృత్యం చేస్తున్న చిన్నారులు



భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

కౌటాల: మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు విజయనగరం, యాపలగూడ, శివలింగపూర్, సదాశివపేట, వీర్దండి, గుండాయిపేట్, గుడ్లబోరి, బాలేపల్లి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థన చేశారు. చిన్నారులు, వేషధారణ, సాంస్కృతిక నృత్యం ఆకట్టుకుంది. విజయనగరం కథలిక్ చర్చి ఫాదర్ సీజో భక్తులకు దేవుడి సందేశం బోధించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.



కాగజ్‌నగర్‌రూరల్: దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు స్థానిక చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. చర్చిలను అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సీఎస్ఐ చర్చిలో సురేశ్, సువర్ణరాజ్‌ల ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, రజిని జాన్‌ప్రకాశ్, విద్యానందం పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని ఇండియన్ మిషన్ చర్చి, గోలేటి బస్టాండ్ సమీపంలోని కార్మెల్ డివైన్ సెంటర్, మండల కేంద్రంలో అగాపే షాలోమ్ చర్చిలతో పాటు పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్లోరియస్ మినిస్ట్రిస్ నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు అతిథిగా హాజరై కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు అనిల్‌గౌడ్, చెన్న సోమశేఖర్, దుర్గం రవీందర్, కిషన్‌గౌడ్, కొవ్వూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్చిలను రంగురంగుల విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. బాలలు, పెద్దలు ఆట, పాటలతో సందడిగా గడిపారు.



రెబ్బెన: కేక్‌కట్ చేస్తున్న మహిళలు



కౌటాల: వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



కౌటాల: దుస్తులు పంపిణీ చేస్తున్న క్రైస్తవులు

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని విఘ్నేశ్వర పూజ, భద్ర మండల దేవత స్థాపన పూజలు, హోమాలు, జలాధివాసం, మూల విరాట్టుకు అష్టోత్తర వితరణ, 108 కలశాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సందీప్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



ఆసిఫాబాద్అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: మాజీ ప్రధానమంత్రి, భారతరత్న దివంగత అటల్ బిహారీ వాజపేయ్ శత జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, కోట్నాక విజయ్, మాటూరి జయరాజ్, పెంటయ్య, సత్తన్న, వెంకన్న పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధుకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నగేశ్, రాజన్న, సంతోష్, భుజంగరావు, సంతోష్, హరీశ్, మహేశ్, కాంతారావు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: నివాళులర్పిస్తున్న నాయకులు

మనుస్మృతి ప్రతులు దహనం



కౌటాల: మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: బీఆర్ అంబేడ్కర్ ఆదర్శవంతుడని నమో బుద్ధ సమాజ్ సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం మనుస్మృతి ప్రతులు దహన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి మండలంలోని తుమ్మిడిహెట్టిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు మహార్ కులస్తులు బౌద్ధ ధర్మ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో అంటరానితనం, కులాది పత్యంతో గతంలో వెనుకబడిన ప్రజలు ఇబ్బంది పడ్డారని అన్నారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. సంఘం మండలాధ్యక్షులు బందురావు, జానకీరావు, కిశోర్, ఆత్మరాం, గోవింద్‌రావు, ఏమాజీ, సాయినాథ్, విజయ్, పత్రు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్ ఎదుట, ఖమాన గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో బుధవారం సమాజ్ క్రాంతి అఘాడి, బీఎస్‌పి, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మనిషిని మనిషిగా చూడని మనుధర్మ శాస్త్రం వలన సమాజానికి ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో సమాజ్ క్రాంతి అఘాడి రాష్ట్ర నాయకులు దుర్గం తిరుపతి. బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఉప్రె జైరాం, విజయ్ ఉప్రె, దుర్గం సునీల్, దుర్గం శ్యాంరావు, విలాస్, రాజేంద్రప్రసాద్, మారుతి, శంకర్, హిరిషన్ పాల్గొన్నారు.



వాంకిడి: మనుస్మృతి ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో బుధవారం జ్వాలా దినోత్సవంలో భాగంగా మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ వాదులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కుల వివక్షతకు మనుస్మృతే ప్రధాన కారణమన్నారు. దళితులు, హరిజనులు వేదాలు చదవకుండా మనుస్మృతివాదులు నాలుకలు కత్తిరించేవారని, వేదాలు వింటే చెవుల్లో సీసం పోసే భయంకరమైన శిక్షలు వేశారన్నారు. కార్యక్రమంలో గంటు మేర, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ముందుకు సాగని వంతెన పనులు



వేసిన శిలాఫలకం



మట్టితో వేసిన అప్రోచ్ రోడ్డు

- రెండు నెలల క్రితం రూ. 18 కోట్లు మంజూరు
- భూ సేకరణ చేపట్టని అధికారులు
- ప్రారంభం కాని పనులు

దహెగాం: అంగట్లో అన్ని ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది వంతెన, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు. దహెగాం- పెంచికల్‌పేట్ మధ్యలో ఉన్న పెద్దవాగుపై రెండు సంవత్సరాల క్రితం వంతెన పూర్తయి వినియోగంలోకి వచ్చింది. అప్రోచ్ రోడ్డుకు రెండు వైపులా మట్టితో పోసి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో అప్రోచ్ రోడ్డు బురదగా మారడం, పాత లగ్గాం సమీపంలో వాగుపై ఉన్న వంతెన చిన్నగా ఉండడంతో వరదలు వచ్చినప్పుడు వంతెనపై నుంచి వరద ప్రవాహం ఉంటుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ తరుణంలో మరో వంతెన నిర్మాణంతో పాటు అప్రోచ్‌రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. అయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

రూ. 18 కోట్లు మంజూరు..

దహెగాం, పెంచికల్‌పేట్ మధ్యలో ఉన్న పెద్ద వాగుపై వంతెన పూర్తికాక లగ్గాం సమీపంలో మరో వంతెన నిర్మాణం చేపట్టడంతో పాటు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఐఎఫ్ (సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) కింద గత మూడు నెలల క్రితం రూ. 18 కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరు కాగానే రెండు నెలల క్రితం సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌లు పనులకు శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో వచ్చే వర్షాకాలం నాటికి వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తి అవుతుందా? లేదా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

భూ సేకరణలో ఆలస్యం..

వంతెన నిర్మాణం అప్రోచ్ రోడ్డు, మరో మూడు వందల వరకు బీటీరోడ్డు వేయాల్సి ఉంది. వ్యవసాయ పొలాల మీదుగా రోడ్డు వేయాల్సి ఉండడంతో రెండు సంవత్సరాల క్రితం భూసేకరణ చేపట్టారు. సుమారు 3 ఎకరాల వరకు భూమి రోడ్డు నిర్మాణంలో పోతుంది. అధికారులు సర్వే చేసి చేతులు దులుపుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. భూ సేకరణ చేశారా? లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. భూ సేకరణలో జాప్యం జరుగుతున్నందున పనులు ప్రారంభం కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వంతెన, రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభం కాలేదు

"దహెగాం- పెంచికల్‌పేట్ మధ్యలో వంతెన నిర్మాణం, రోడ్డు నిర్మాణానికి రూ. 18 కోట్లు మంజూరయ్యాయి. రెవెన్యూ శాఖ వారు భూ సేకరణ చేపట్టలేదు. అందుకే పనులు ప్రారంభం కాలేదు. భూ సేకరణ చేపడితే త్వరగా పనులు ప్రారంభిస్తాం."

– లక్ష్మినారాయణ, ఆర్అండ్‌బీ డీఈ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దహెగాం: పులుల సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో సద్దాం అన్నారు. బుధవారం పెంచికల్‌పేట మండలం గొంట్లపేట సమీపంలో పెద్దవాగు వద్ద పులి అడుగులు కనిపించాయని దీంతో వ్యవసాయ పనులకు, పశులు మేపేందుకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుంపులు గుంపులుగా వెళ్లాని సూచించారు. పులి కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉదయం 10 గంటల తరువాత పనులకు వెళ్లాలని, సాయంత్రం 4 గంటలకే ఇళ్లకు చేరుకోవాలన్నారు. బీట్ అధికారులు వెంకటేశ్, సురేందర్, సిబ్బంది ఉన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

రెబ్బెన: అనిల్ అన్న యువసైన్యం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. జిల్లాలో పెరిగిన చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బుధవారం గోలేటిలో 200 మంది వృద్ధులకు ఫౌండేషన్ చైర్మన్ జువ్వాజీ అనిల్‌గౌడ్‌తో కలిసి దుప్పట్లు పంపిణీ చేశారు. ఇదే తరహాలో యువసైన్యం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతిఒక్కరిలో సేవాభావాన్ని నింపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోషం, చరణ్, సాగర్, కిషన్‌గౌడ్, సోమశేఖర్, కొవ్వూరి శ్రీనివాస్, సురేందర్‌రాజు, ప్రభాకర్, దుర్గం రవీందర్, కిషోర్, సంజయ్, తిరుపతి, జనక్‌ప్రసాద్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న విశ్వప్రసాద్‌రావు

దళారుల చేతిలో మోసపోతున్న రైతులు



పరిశీలిస్తున్న సంగెపు బొర్రన్న

నార్నూర్: దళారుల చేతిలో రైతులు మోసపోతున్నారని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వారపు సంత కావడంతో స్వయంగా మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్న పత్తి కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల నుంచి రైతులు పండించిన పంటలను ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు ప్రైవేట్ వ్యా పారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా లైసెన్స్ లేని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.